www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 18 మే 2023

5

పశ్చిమ గోదావరి

సర్పంచి చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం సర్పంచి బొల్లా శ్రీనివాస్ చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని చినపేట, గోపీకృష్ణ థియేటర్, క్రిస్టియన్‌పేట, మునుగులమ్మ ఆలయం, మార్కెట్ ప్రాంతాల్లో కొంతకాలంగా ప్రజలులో ఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. వేసవి కావడంతో సమస్య మరింత తీవ్రమైందని, దీంతో ట్రాన్స్‌కో అధికారులను సంప్రదించి గ్రామంలో అవసరమైన చోట అదనంగా విద్యుత్ పరివర్తకాలను బుధవారం ఏర్పాటు చేయించినట్లు సర్పంచి శ్రీనివాస్ తెలిపారు.

పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచి

కట్..కట్..!

- కరెంటు కోతలతో జనం విలవిల
- గ్రామాల్లో ఐదు గంటలుపైనే కోత
- పట్టణాల్లోనూ గంటలు తరబడి కోతలే
- ప్రతిరోజూ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు
- ఉక్కపోతతో తల్లడిల్లుతున్న జనం
- ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కరెంటు కోతలతో జిల్లా ప్రజానీకం తల్లడిల్లుతున్నారు. రోజువారీ విద్యుత్ వినియోగం 22 మిలియన్ యూనిట్ల నుంచి 23.5 మిలియన్ యూనిట్లకు పెరిగిందంటూ లోడు రిలీఫ్ పేరుతో ఎడాపెడా కరెంటు కోతలు అమలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో రెండు జిల్లాల ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దీనిలో పేద, మధ్యతరగతి విద్యుత్ ప్రజల కనెక్షన్లే అధికం. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో ప్రతిరోజూ 45 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులకు జనం విలవిల్లాడుతున్నారు. ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఎండలకు తట్టుకోలేక ఇంట్లో ఉన్న కరెంటు కోతలతో ఉపశమనం లేని పరిస్థితి ఏర్పడింది. లోడ్ రిలీఫ్ పేరుతో సమయం, సందర్భం లేకుండా ఇష్టానుసారంగా కరెంటు కోతలు అమలు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగర పరిధిలోని తంగెళ్లమూడిలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు తీసేసిన కరెంటు తెల్లవారే వరకూ ఇవ్వని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించకపోవడంతో జనం రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఏలూరు పట్టణ కేంద్రంలోనూ అర్ధరాత్రి గంటకుపైగా కరెంటు కోత కొనసాగింది. భీమడోలు మండలం పొలసానిపల్లిలో నాలుగైదు గంటలు కరెంటు కోత పెట్టడంతో జనం అల్లాడిపోయిన పరిస్థితి నెలకొంది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి గ్రామంలోనూ కరెంటు కోతల బాధలు జనాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. గ్రామాల్లో అయితే ఇష్టానుసారంగా కరెంటు కోతలు అమలవుతున్నాయి. పలు గ్రామాల్లో రోజుకు నాలుగైదు గంటలు కోతలు కొనసాగుతుండగా,



కొన్ని గ్రామాల్లో ఏడెనిమిది గంటలు సైతం కోతలు విధిస్తున్నారు. ఇన్వర్టర్లు ఉన్నవారు కొంత ఉపశమనం పొందుతుండగా, లేనివారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాత్రంతా నిద్ర లేకుండాపోతుంది. పగలూ రాత్రి ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉక్కపోతకు తాళలేక పిల్లలు గుక్కపెట్టి ఏడుస్తుండటంతో వారిని బుజ్జగించడంతోనే రాత్రంతా గడిచిపోతుంది. బిల్డింగ్‌పైన సేదతీరుదామని వెళ్లినా దోమల ధాటికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. డెల్టా, మెట్ట ప్రాంతం అనే తేడా లేకుండా కరెంటు కోతలు అమలవుతున్నాయి. విద్యుత్ వినియోగం పెరగడంతో అనధికారికంగా లోడ్ రిలీఫ్ పేరుతో కరెంటు కోతలు అమలు చేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో వెంటాడుతున్న కరెంటు కోతలు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరం

కరెంటు కోతలతో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉష్ణోగ్రతలు పెరగడంతో రొయ్యల సాగు కత్తిమీద సాములా మారింది. చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గకుండా ఉండాలంటే నిరంతరం రేడియేటర్లు తిప్పాలి. రేడియేటర్లు ఆడించాలంటే కరెంటు ఉండాలి. కరెంటు కోతలతో జనరేటర్లతోనే రేడియటర్లు ఆడించాల్సి వస్తోంది. దీంతో ఖర్చు తడిసిమోపెడవుతుందని ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. రెండు జిల్లాల్లోనూ దాదాపు రెండు లక్షలకుపైగా ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. దీనిలో అత్యధికంగా రొయ్యల సాగే ఉంది. ఇప్పటికే సరైన ధరలేక రొయ్యల సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పుడు కరెంటు కోతలతో ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకూ అదనపు పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వేసవి తీవ్రత ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారనుందని చెబుతున్నారు.

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- ఒకేచోట రెండేళ్లు పూర్తయిన వారికి బదిలీ అవకాశం
- రెండు జిల్లాల్లో 48 వేల మంది ఉద్యోగులు
- బదిలీల్లో 20 శాతం ఉద్యోగులు కదిలే పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకూ బదిలీల ప్రక్రియ జరగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒకే స్థానంలో ఐదేళ్లు పని చేసేవారికి తప్పనిసరిగా బదిలీలు ఉండగా, రెండేళ్ల కాలం పూర్తి చేసుకున్న వారు వారి ఇష్టం మేరకు బదిలీలకు అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో రెవెన్యూ, ఎన్‌జిఒలతోపాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు 48 వేల మంది వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బదిలీల్లో భాగంగా 15 నుంచి 20 శాతం మంది ఉద్యోగులకు స్థాన చలనం కలగనుందని చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత తహశీల్దార్లు వివిధ జిల్లాల నుంచి జిల్లాకు వచ్చారు.



వీరికి ఐదేళ్ల కాలం పూర్తి కాలేదు. ఇటువంటి వారికి వారు కోరుకుంటేనే బదిలీ ఉంటుంది. బదిలీల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ఎప్పటినుంచో బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల్లో హడావుడి మొదలైంది. తాము కోరుకున్న స్థానాలకు, సొంతూరుకు దగ్గర్లోకి వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

నాడు-నేడు పనులు నాణ్యతతో పూర్తి చేయాలి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

నాడు-నేడు కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణం, ఎలక్ట్రికల్ వర్కులు, మేజర్, మైనర్ రిపేర్ పనులు వచ్చేవారం నాటికి 60 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు చేసిన ఖర్చుకు సంబంధించిన బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొన్ని పాఠశాలలకు వచ్చిన టాయిలెట్, ఎలక్ట్రికల్ సామాన్లు, టైల్స్, డోర్లు తదితర మెటీరియల్ వెంటనే వినియోగించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనుల వారీగా ఇప్పటివరకు పూర్తయిన వాటిని స్టేజ్‌వారీగా అప్‌డేట్ చేయాలన్నారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ వారంలో రెండు రోజులు విధిగా పాఠశాలల్లో తనిఖీకి వెళ్లాలని, ఆ వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ దేవరకొండ అఖిల, సమగ్రశిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి పి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఇఇ బి.లోకేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఇ ఎఎస్ఎ.రామస్వామి, పబ్లిక్ హెల్త్ ఇఇ, వివిధ శాఖల డిఇలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పక్కాప్రణాళికతో తాగునీరందించాలి

పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పక్కాప్రణాళికతో నీటి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో భీమవరం అభివృద్ధి పనులపై ఆమె సమీక్షించారు. ప్రకాష్‌నగర్, దుర్గాపురం, బిసి కాలనీ, రాయలం తదితర ప్రాంతాల ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. తాగునీటి కొరతపై జెకెసి, స్పందన ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రాంతాలవారీగా జనాభా ప్రాతిపదికన తగినన్ని ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి షాపు ముందు ఫేవర్‌బ్లాక్స్ ఏర్పాటు చేయాలని పలు సమావేశాల్లో ఆదేశించినా నేటికీ ఆచరణకు నోచుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన ఫేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రణాళిక రూపొందించి సమర్పించాలన్నారు. లోసరి మార్గంలో ఆర్‌అండ్‌బి రోడ్డు ప్రారంభమయ్యే ప్రాంతంలో రోడ్డు పక్కన చెత్తను తొలగించి అడ్డుగా జిఐ షీట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ దేవరకొండ అఖిల, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారి ఆర్.విజయ్, ఎసిపి గౌర్, డిఇ నారాయణరావు, ఎంఇ త్రినాధరావు పాల్గొన్నారు.

అదనంగా ధాన్యం వసూళ్లను అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

రైతుల నుంచి అదనపు కిలోల ధాన్యం వసూళ్లను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతు నేటికీ అన్యాయానికి గురవుతూనే ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ముప్పుతిప్పలు పడాల్సి వస్తోందన్నారు. ధాన్యాన్ని అమ్ముకునే క్రమంలో కూడా ఎక్కువగా నష్టపోతున్నారన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పూర్తి బాధ్యత వహించాలన్నారు. వ్యాపారస్తులు ధాన్యం ముక్కవుతుందని, తడిచిందని, రంగు మారిందని, మొలకెత్తిందనే పేరుతో ఏదోక రూపంలో ధర తగ్గించాలని చూస్తున్నారని అన్నారు. సీజన్ మొదట్లో 40 కేజీలకు రూ.30 నుండి రూ.50, రూ.70 వరకు నూకశాతం పేరుతో నష్టపరిహారంగా వసూలు చేయడం వల్ల రైతులు నష్టపోయారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎక్కడ నూకశాతం పేరుతో వసూళ్లు చేయడం లేదని పైకి కల్లబొల్లి మాటలు చెబుతుందన్నారు. అయితే నేడు దాని స్థానంలో బస్తా సంచికి 500, 600 గ్రాములు తూయాల్సి ఉండగా, ప్రస్తుతం సంచికి అదనంగా ఒక కేజీ వరకు తూస్తున్నారన్నారు. ముక్కవుతుందనే పేరుతో అధికారులే మరొక కేజీ అదనంగా తూయాలని చెప్పడం దుర్మార్గమన్నారు. అధికారులే ఇలా చెప్పడంతో చాలాచోట్ల 1121, 1153, 1156, 126 రకాల ధ్యాన్యానికి 2, 3 కేజీల వరకు అదనంగా తూచి వ్యాపారస్తులు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల పేద, కౌలు రైతులు ఎకరాకు ఐదారు వేలు వరకు నష్టపోతున్నారన్నారు. ఇది రైతులను బహిరంగంగా దోచుకోవడానికి అధికారులు ఇచ్చిన లైసెన్స్‌గా కన్పిస్తోందన్నారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి కోతలు పెట్టినా సహించం, రేటు తగ్గిస్తే ఊరుకోం, అదనంగా ఒక్క కేజీ కూడా తూయవద్దని హెచ్చరికలు జారీ చేసి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అయితే మన రాష్ట్రంలో రైతులను నష్టపెట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులు ఇంత నష్టపోతున్నా జిల్లా మంత్రులు, అధికార పార్టీ ప్రజాపతినిధులు ఒక్కరు కూడా నోరు మెదపడం లేదన్నారు. సాక్షాత్తు పౌర సరఫరాల మంత్రి జిల్లావాసే అయినప్పటికీ ఆర్భాట ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. పైగా మంత్రి రైతులను అవమానించేలా, హేళన చేసేలా మాట్లాడడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం దీనిలో జోక్యం చేసుకుని అదనపు ధాన్యం వసూళ్లను ఆపాలన్నారు. అలా అదనంగా వసూలు చేసిన ధాన్యానికి కూడా నగదు చెలించాలన్నారు. కేవలం సంచి బరువు మాత్రమే తీసుకోవాలన్నారు. అలా జరిగిన చోట్ల వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు కూడా సంఘటితంగా నిలబడి అదనపు కేజీల వసూళ్లను అడ్డుకోవాలన్నారు. రైతుల ఆందోళనకు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని బలరాం అన్నారు.



ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకు 35 కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్ తదితర మౌలిక సదుపాయాలను మరోసారి పరిశీలించాలన్నారు. ఏ విద్యార్థీ నేల మీద కూర్చుని పరీక్షలు రాసే పరిస్థితి ఉండరాదన్నారు. ఆశా, ఎఎన్ఎంలను నియమించడంతోపాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు కోవిడ్‌కు సంబంధించిన మాస్కులు, శానిటైజర్లు అందరికీ సరిపడేలా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆమె ఆదేశించారు. పరీక్షా సమయానికి హాజరయ్యేందుకు అనువైన సమయాల్లో సౌకర్యవంతంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద రక్షిత తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో జిరాక్స్ షాపులు, కంప్యూటర్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐఒ చంద్రశేఖర్‌బాబు, డిఎల్‌పిఒ ఎం.నాగలత, పోలీస్, విద్యుత్, పోస్టల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ కృష్ణవేణి

అప్రకటిత కరెంటు కోతలు ఆపండి

లేనిపక్షంలో సబ్‌స్టేషన్ ముట్టడి - ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యుత్ కోతల వల్ల జనం తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని, తక్షణం అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కోరారు. అడవిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎడిఇని ఎంఎల్ఎ బుధవారం కలిశారు. పట్టణంలో అప్రకటిత కరెంటు కోతలు ఏమిటని ప్రశ్నించారు. వేసవి వచ్చినా, వర్షాలొచ్చినా చిన్నపాటి గాలిదుమారం వచ్చినా పాలకొల్లు వాసులకు కరెంట్ కష్టాలు తప్పట్లేదన్నారు. చంద్రబాబు హయాంలో 24 గంటలు కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేశారని గుర్తు చేశారు. 2019 తర్వాత అప్రకటిత కరెంటు కోతలతో చంటి బిడ్డల తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని సబ్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ కరెంటు ఎప్పుడొస్తుందని నిలదీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం కోతలు ఆపాలని, లేనిపక్షంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడికి జనం సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

గోదావరి హెడ్‌వర్క్స్ ఇఇచే పెరుగులంక భూముల పరిశీలన

సొసైటీ సభ్యుల ప్రశ్నలకు సమాధానం కరువు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏనుగువానిలంక పరిధిలో ఉన్న చించినాడ గ్రామ ఎస్‌సి, బిసి, ఇతర పేదల అధీనంలో ఉన్న పెరుగులంక భూములను బుధవారం ధవళేశ్వరం గోదావరి హెడ్‌వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.సోమేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.సుబ్బారావు, మైనింగ్ డిపార్టుమెంట్ జియాలజిస్ట్ పురుషోత్తమనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిని కలిసిన డి.ఫారం పట్టా భూముల సొసైటీ సభ్యులు మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు సంబంధించిన అధికారులు ఎసి రూముల్లో కూర్చుని కాంట్రాక్టర్లు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి కాంట్రాక్టర్లకు, మట్టి మాఫియా వారికి అనధికార అనుమతులు ఇచ్చారని ఆరోపించంఆరు. ఫలితంగా పేదల సాగులో ఉన్న పెరుగు లంక భూముల్లోని మట్టిని ఇక్కడి నుండి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పేదల పొట్టను కొడుతున్నారన్నారు. అసలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోదావరికి ఎన్ని మీటర్ల దూరంలో మట్టిని తవ్వుతారని అడిగిన ప్రశ్నకు అధికారులు మౌనం వహించారు. జనం పదేపదే ప్రశ్నించగా అక్కడి నుండి వెనుదిరిగారు. అధికారులను కలిసిన వారిలో లంకల సొసైటీ అధ్యక్షుడు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, సభ్యులు కానేటి బాలరాజు, చెల్లుబోయిన వడ్డికాసులు, తెన్నేటి స్టాలిన్, మురాల రాజేష్, బుసి నరేష్, తదితరులు ఉన్నారు.

లంక భూముల పరిశీలనకు వచ్చిన అధికారులు

మాట్లాడుతున్న సుబ్బరాజు

టెంట్లు లేవు.. నీళ్లూ లేవు

ఉపాధి పనుల సందర్శనలో నేతల వద్ద కూలీల ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

పని ప్రదేశంలో టెంట్‌గాని, ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్‌గాని, తాగునీరుగాని లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, నేత జి.వెంకటేశ్వర్లు వద్ద వాపోయారు. జుత్తిగలో ఉపాధి పని ప్రదేశంలో నేతలు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో పని చేసిన రోజులకు పే స్లిప్‌లు, పనిముట్లకు అద్దె ఇచ్చేవారని, ప్రస్తుతం అవేమీ కన్పించడం లేదని అన్నారు. గతంలో కేంద్ర బడ్జెట్లో నాలుగు శాతం, తర్వాత మూడు శాతం, తర్వాత రెండు శాతం ప్రస్తుతం 1.5 శాతం నిధులు కేటాయించినట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం ధరలు విపరీతంగా పెరుగుతున్న సందర్భంలో ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.దుర్గ, కె.లక్ష్మి, జి.లక్ష్మి, జి.నర్సమ్మ, టి.సుమలత, జి.మాణిక్యం పాల్గొన్నారు.

ప్రజాసేవలోనే సంతృప్తి

డిఎస్‌పి మనోహరాచారి

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతి ఉద్యోగికీ సంతోషం, బాధలు ఉంటాయని, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకూ ఉంటాయని, చేసే వృత్తిని పవిత్రంగా భావించి ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి చెప్పారు. పాలకొల్లు సర్కిల్‌లోని సచివాలయ మహిళా పోలీసులకు అడబాల గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండలో డ్యూటీ చేసే హోంగార్డులకు తెల్లటోపీ, నల్ల కళ్లజోడు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికం అభివృద్ధితోపాటు మోస ప్రవృత్తి కూడా పెరిగిందని చెప్పారు. నేరం జరగకుండా అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. సైబర్ క్రైమ్‌కు వచ్చే ఫిర్యాదులన్నీ విద్యావంతులు చేస్తున్నవేనన్నారు. చిన్నారులు, ఒంటరి మహిళలపై లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సచివాలయ పోలీసులు చెప్పిన బాధలను జిల్లా ఎస్‌పి దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో పాలకొల్లు పట్టణ, రూరల్ సిఐలు జి.రాంబాబు, కొండవీటి శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి మనోహరాచారి

గ్రామస్తులకు కరపత్రం అందజేస్తున్న కవురు శ్రీనివాస్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

భగ్గేశ్వరం గ్రామంలో 122వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జిల్లా పరిషత్ ఛైర్మన్, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నవరత్నాల వివరాలు కలిగిన కరపత్రాలను ప్రతి ఇంటికీ పంచారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలను కోరారు. ఏ సమస్య ఉన్నా స్థానిక అధికారుల ద్వారా తమకు తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుణ్ణం నాగబాబు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామ అధ్యక్షులు మహేష్, అందే శివ కోటయ్య, నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

24 నుంచి ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంజినీరింగ్ కళాశాల ల్యాబ్ టెక్నీషియన్స్‌కు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించినట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇసిఇ హెడ్ డాక్టర్ ఎన్.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ ప్రయోగశాలలో పనిచేస్తున్న టెక్నీషియన్స్‌కు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబాడెడ్ సిస్టమ్స్ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సమాచారం అందించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కాళ్ల

వేసవిలో దాహార్తిని తీర్చడానికి దాతలు ముందుకొచ్చి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పెదఅమిరం సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. వేసవి తీవ్రత పెరగడంతో పెదఅమిరంలో పలు చోట్ల చలివేంద్రాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఉండి - భీమవరం రోడ్డులో ఉప్పరగూడెం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అబ్బాయి తాగునీటి చెరువు వద్ద వినాయక ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాలను సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాతలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోడూరు : జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్ బాబు ఆధ్వర్యంలో గుమ్మలూరు స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రం నిర్విరామంగా కొనసాగుతూ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. అధిక ఎండల్లో చలివేంద్రం ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్న జనసేన నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

కంటి చూపు పట్ల అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైఎస్ఆర్ కంటి వెలుగును ఉపయోగించుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని వెంకటరాజపురం గ్రామ సర్పంచి మల్లంపల్లి సురేష్ అన్నారు. పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కంటి వెలుగును స్థానికులు ఉపయోగించుకొని కంటి చూపు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 60 ఏళ్లు పైబడిన 55 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు పడతాయని, ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో గణపవరం సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, హెల్త్ అసిస్టెంటు ఎన్.యోహాను పాల్గొన్నారు.

గణపవరంలో అన్న సమారాధన

ప్రజాశక్తి - గణపవరం

హనుమాన్ జయంతి సందర్భంగా సువర్చల సహిత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమాధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, సరిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వంకాయల రామారావు, ఇఒ శ్రీధర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో బాటసారులకు వడదెబ్బ తగలకుండా కాశిపాడు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నట్లు కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వల్ల బాటసారులకు వడదెబ్బ తగలకుండా నీటిలో ఒఆర్ఎస్ పౌడరు కలిపి అందజేస్తున్నట్లు చెప్పారు. వడదెబ్బ తగలకుండా నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శేఖర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, ఎఎన్ఎం శివకుమారి మహిళా పోలీస్ భానుప్రియ, ఆశా వర్కర్లు టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

పాందువ్వలో ప్రార్థనా మందిరం ప్రారంభం

ఉండి: పాందువ్వ గ్రామంలో క్రైస్ట్ లూథరన్ ప్రార్థనా మందిరం ప్రారంభ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. లూథరన్ చర్చి నిర్మాణాన్ని 2016వ సంవత్సరంలోనే ప్రారంభించారని, ప్రార్థన మందిరం కమిటీ సభ్యులు, దాతల సహకారంతో అత్యాధునిక హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తమను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంతెన సూర్యనారాయణ రాజు, చింతలపాటి వెంకటరామరాజు, అల్లూరి రాంబాబు రాజు, ఉద్ధరాజు సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో పెన్షనర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. సీతారామరాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇకెవైసి చేయించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. చాలా మంది పెన్షనర్లకు ఆధార్‌కు ఫోన్ లింక్ కాకపోవడం, లింక్ చేయడానికి ఐరిష్, వేలిముద్రలు పడకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అనేక మంది పెన్షనర్లు వయస్సు, అనారోగ్య కారణాల రీత్యా కదలలేని స్థితిలో ఉండడం, ఎక్కువ మంది పెన్షనర్లు వారి పిల్లల వద్ద ఉండడం, అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఇకెవైసి చేయడం ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. పెన్షనర్లకు ఇకెవైసి నమోదుకు సమయం పొడిగించి, పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలో ఏ వార్డులో పర్యటించినా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని జనసేన తణుకు నియోజకవర్గం ఇన్‌ఛార్జి విడవాడ రామచంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డులో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏ వార్డులోకి వెళ్లినా డ్రెయినేజీ వాటర్ పైప్ లైన్ వంటి సదుపాయాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు గరే తులసీరామ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పంతం నానాజీ, జిల్లా సెక్రటరీ తమరాపు నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆక్వాకు సన్ స్ట్రోక్..!

రక్షణ చర్యల్లో చేపలు, రొయ్యల రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణం అనుకూలిస్తే సిరులు కురిపిస్తుంది. లేకుంటే కోలుకోలేని దెబ్బతీస్తుంది. ఇది రొయ్యల సాగు పరిస్థితి. రెండేళ్లుగా ఆక్వాసాగు ఒడిదుడుకుల్లో నడుస్తోంది. ఎండ వేడిమికి రొయ్యలు కకావికలం అవుతున్నాయి. ప్రధానంగా చేపలు, రొయ్యల సాగు కుతకుత ఉడుకుతోంది. భారీ వర్షాల తర్వాత ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వాతావరణం అగ్నిగుండంలా మారిపోయి వడగాల్పులు వీస్తున్నాయి. దీంతో ఆక్వారైతులు ఆందోళన చెందుతున్నారు.

రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు

మూడు రోజులుగా చేపలు, రొయ్యలు కళ్లు తేలేస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులు చేపల పట్టుబడులు చేసి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. మండలంలో పలు ప్రాంతాల్లో చేపలు చనిపోకుండా మందులు వాడినా ఫలితం లేదు. చెరువుల్లో పిహెచ్ శాతం, డిఒ శాతం బాగా తగ్గింది.

మండలంలో 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 15 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

చేపల పట్టుబడులు..

చెరువుల్లో మత్స్య సంపదను రక్షించుకోవడానికి రైతులు అదనపు పెట్టుబడులు పెడుతున్నా ఆక్సిజన్ సమస్యతో చేపలు, రొయ్యలు అక్కడక్కడా చనిపోతున్నాయి. దీంతో కొంత రైతులు పట్టుబడి చేసి ఎగుమతి చేస్తున్నారు. మండలంలో ప్రాతళ్లమెరక, జువ్వలపాలెం, కలవపూడి తదితర గ్రామాల్లో రైతులు రొయ్యలను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది అయితే ఇప్పట్లో వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడం లేదని భావించి పట్టుబడులకు దిగారు. మార్కెట్లో చేపలు, రొయ్యలకు ఆశాజనకమైన ధర లేకపోయినా అందుబాటులో ఉన్న ధరకే అమ్ముకుంటున్నారు.

తగ్గిన చేపల, రొయ్యల ధరలు..

చేపల ధర 115 రూపాయల ఉండేది. ఐదు రూపాయలు తగ్గింది. రొయ్యల ధర 30 కౌంటు రూ.430, 40 కౌంట్ రూ.380 ఉంది. ప్రతి కౌంట్‌కూ 15 రూపాయలు తక్కువకు రొయ్యలను కొనుగోలు చేస్తున్నారు. రొయ్య ధర తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో నష్టం రాకపోయినా పెట్టుబడులు, కాస్త మిగులు ఉంటుందని భావించిన రైతులు వారం రోజులుగా పట్టుబడులను పెంచారు. అప్పటికప్పుడు పట్టుబడి చేసి ఎగుమతులు చేస్తున్నారు. కొంతమంది రైతులైతే వాటిని సంరక్షించుకోవడానికి పెట్టుబడులు పెడుతున్నారు. ప్రొబయోటిక్స్‌ను వినియోగించడం ద్వారా చెరువుల్లోని నీటిని శుద్ధిచేసి ఆక్సిజన్ సమస్యను పరిష్కరిస్తున్నారు. ఎక్కువ మంది వేసవిలో మేత వేయడం ద్వారా అవి వాతావరణానికి ఆహారం తీసుకోకపోవడంతో చెరువు అడుగుకు చేరుతున్నాయి. రొయ్యలకు ఆక్సిజన్ సమస్య తలెత్తి చనిపోయే పరిస్థితులు ఉన్న దృష్ట్యా రొయ్యల పట్టుబడులు చేస్తున్నారు.

గణనీయంగా పెరిగిన ఉష్ణోగ్రతలు..

మూడు రోజుల నుంచి 39, 40, 43 డిగ్రీల మధ్య వాతావరణం కొనసాగించడంతో చేపలు, రొయ్యలు విలవిల్లాడుతున్నాయి. చిన్న సైజులో ఉంటే వాటిని ఎకరానికి వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి రక్షించుకుంటున్నారు. ఎదిగిన చేపలు, సైజు కొచ్చిన రొయ్యలను మాత్రం పట్టుబడులు చేసి అమ్ముకుంటున్నారు. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల వల్ల ఆక్వా రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుంది.

ఏరియేటర్లు తిప్పాలి..

సిహెచ్ రాంబాబు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, కాళ్ల

ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. చేపలు, రొయ్యల పంటను రక్షించేందుకు నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పడం వల్ల చెరువులో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. ఆయిల్ ఇంజిన్లతో నీటిని రీసైక్లింగ్ చేయాలి. చెరువుల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలి.

'గడపగడపకూ' విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకోడేరు

గడపగడపకూ వెళ్తున్న సందర్భంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో అధిక మెజార్టీతో ఉండి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరేస్తామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. వేంద్రలో మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంటిరాజుతో పాటు పివిఎల్ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేశారన్నారు. ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని పూర్తి నమ్మకం ఉందన్నారు. రాబోయే రోజుల్లో నరసింహరాజు ఎంఎల్‌ఎగా గెలుపొందే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి నాగేశ్వరి, ఉపసర్పంచి భూపతిరాజు, సుబ్బరాజు, నాయకులు వర్మ, దవాలా కె.వెంకటేశ్వరరావు, సానబోయిన వేణు, వేగి రమణ, నేలపాటి రాజబాబు, బి.నాగరాజు, వీరబాబు, వెంకటేశ్వరరావు, దేవరాజు, జాన్, రాంబాబు, పాపారావు, బొల్లా శ్రీనివాస్, నరేష్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ మురళీ గంగాధర్, ఆర్ఐ నాగభూషణరావు, విఆర్ఒ అలేఖ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు కరపత్రం అందజేస్తున్న పివిఎల్ నరసింహరాజు

సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురంటౌన్

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. బుధవారం స్థానిక అల్లూరి కళ్యాణ మండపంలో జరిగిన జిల్లా స్థాయి మత్స్యకార భరోసా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మత్స్యకారులకు ఆర్థిక భరోసాను కలుగజేసే విధంగా వేట నిషేధ కాలంలో మత్స్యకార భరోసా సాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,635 మంది లబ్ధిదారులకు ఒక్కరికి 10 వేల రూపాయల చొప్పున 1.63 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి విడుదల చేసినట్లు తలెఇపారు. మొగల్తూరు మండలంలో 690 మంది, నరసాపురం మండలంలో 945 మంది లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో విస్తరించి ఉన్న సముద్ర తీర ప్రాంతంలో 3,500 వరకూ మత్స్యకార కుటుంబాలు ఉన్నాయన్నారు. వారిలో 1,635 మంది లబ్ధిదారులకు నేడు మత్స్యకార భరోసా జమ చేసినట్లు తెలిపారు. అనంతరం పొన్నపల్లి ఏటిగట్టు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ దేవరకొండ అఖిల, మత్స్యశాఖ జెడి ఆర్‌జివిఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



మత్స్యకారులకు భరోసా చెక్కు అందజేస్తున్న ముదునూరి, కలెక్టర్

భూములిచ్చిన పేదలకు అండగా ఉంటాం

జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పేద రైతుల భూములు తీసుకుని వారికి పరిహారం చెల్లించకుండా ప్రభుత్వ అధికారులు ఇబ్బందులు గురిచేయడం సరికాదని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు అన్నారు. పాలకోడేరులో జగనన్న కాలనీకి స్థలాన్ని ఇచ్చిన పేద రైతులకు పరిహారం చెల్లించకపోవడంతో బాధితులు వారం రోజులుగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నిరసనకు జనసేన మద్దతు తెలిపి బుధవారం జుత్తుగ నాగరాజు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతుల దగ్గర్నుంచి తీసుకున్న ఎకరంన్నర భూమికి నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వ అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. వారం రోజులుగా రైతులు మండుటెండను సైతం లెక్కచేయకుండా దీక్ష చేపడుతున్న కనీసం వారి వద్దకు వచ్చి ప్రభుత్వ పెద్దలు గానీ, అధికారులు గానీ హామీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గాదం నానాజీ, నాయకులు శిరిగినీడి శ్రీనివాసు, సవరం సత్యకృష్ణ, ప్రసాద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నేడు పాదయాత్ర : సిపిఎం

పాలకోడేరు జగనన్న కాలనీకి భూములు తీసుకుని పరిహారం చెల్లించకుండా రైతులను ఇబ్బందులు గురిచేస్తున్న అధికారులు తీరుకు నిరసనగా గురువారం పాదయాత్ర నిర్వహించనున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.గోపాలన్ తెలిపారు. బుధవారం బాధితులను పరామర్శించిన ఆయన పాదయాత్రకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా పేద రైతులకు గ్రామస్థాయి నుంచి మద్దతు కూడగట్టేందుకు సమస్యను వివరించేందుకు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పాదయాత్రకు, పేద రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని లేకపోతే భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రయ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మోషేన్‌రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్ర కుమార్ మేనల్లుడు దాట్ల ఈశ్వర్ వివాహ రిసెప్షన్ కోరుకొల్లులో జరిగింది. ఈ కార్యక్రమానికి శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు హాజరై నూతన వధూవరులు దాట్ల ఈశ్వర్ హిమ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ దాట్ల వేణుగోపాల్ రాజు, సుభ దంపతులు, ప్రముఖ హోమియో వైద్యులు పాల్గొన్నారు.

తణుకులో మేరా లైఫ్ మేరా స్వచ్ఛనగర్

ప్రజాశక్తి - తణుకు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు తణుకు పురపాలక సంఘంలో ఈనెల 17వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు మేరా లైఫ్ మేరా స్వచ్ఛ నగర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కెటి.సుధాకర్ తెలిపారు. బుధవారం పట్నంలోని 14వ వార్డు కొమ్మాయి చెరువుగట్టు, ఆరో వార్డు జవహర్‌లాల్ నెహ్రూ కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటుచేసిన రెడ్యూస్ రీసైకిల్ రియాజ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఈ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, షూలు, చెప్పులు టోపీలు, పరుపులు తదితర వస్తువులను ఈ సెంటర్లకు అందిస్తే వాటిని అవసరమైన ఉన్నవారికి అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

బుధవారం నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. ఉదయం 8 గంటల నుండి పిల్లలకు స్టోరీ టెల్లింగ్, రీడింగ్ చేయించారు. సాంకేతిక నిపుణత కలిగి ఉండాలంటే మెడిటేషన్ ద్వారా సాధన చేస్తే సాధ్యమవుతుందని స్కూల్ కోఆర్డినేటర్ యుక్త వాసవి తెలిపారు. డాక్టర్ చిన్నమిల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కెవి.రావు, సిహెచ్ శ్రీనివాస్, సూర్యం బాబు సుధీర్ మోహన్ పాల్గొన్నారు.

వారతిప్పలో ఆక్రమణలు అడ్డగింత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని వారతిప్ప గ్రామంలో గత ప్రభుత్వంలో గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కొంత మంది గ్రామస్తులు కబ్జా చేస్తుండటంతో బుధవారం సాయంత్రం గ్రామస్తులు, ఆ గ్రామ మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి గురుకుల పాఠశాల మంజూరైంది. ఈ నేపథ్యంలో వారతిప్పలో పాఠశాలను ఆర్ఎస్ నంబర్ 70లో సుమారు 5 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. పలువురు ఆక్రమణదారులు ఆస్థలంలో మూడు రోజుల క్రితమే షెడ్లు, కుళాయి పైప్ లైన్ వేసి, బుధవారం మొక్కలు నాటుతుండడంతో గుర్తించిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు పనులను అడ్డుకున్నారు. తమ గ్రామంలో గురుకుల పాఠశాల నిర్మాణం చేపట్టాలని, ఇందుకు కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపతామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డు

కాళ్లలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో గ్రామీణ ఉపాధి పథకంలో 21 గ్రామాల్లో 1091 పనులను రూ.7.59 కోట్ల విలువైన పనులు చేపట్టారని డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు తెలిపారు. కాళ్లలో మండల స్థాయి సామాజిక తనిఖీపై ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. కాళ్ల, కోపల్లె గ్రామాల్లో లక్షా 37 వేల 339 రూపాయలు రికవరీ చేయాలని అధికారులు తనిఖీల్లో నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి విజయలక్ష్మి, స్టేట్ మానటరింగ్ టీమ్ ఎ.గౌరీశంకర్, ఎంపిడిఒ జి.స్వాతి, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, టిఎబి రమేష్ బాబు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావు మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - తణుకు రూరల్

చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు వాసా రామ్మోహన్‌రావు మృతి చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కాసా రత్నకుమార్, కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు, పూర్వపు జిల్లా కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచంట వేమవరానికి చెందిన రామ్మోహన్‌రావు స్థానిక చేనేత సహకార సొసైటీ డైరెక్టర్‌గా, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షునిగా పనిచేశారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షునిగా కొనసాగుతూ చేనేత కార్మికుల సమస్యలపై తుదిశ్వాస విడిచే వరకూ అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ఆయన మృతికి రత్న కుమార్, ఆదిశేషు, వీరభద్రరావు సంతాపం తెలిపారు.

విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం

విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకానికి http://jnan-abhumi.ap.gov.in వెబ్ సైట్‌లో లాగిన్ అయి జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వయోపరిమితి 35 సంవత్సరాలు, వార్షిక ఆదాయం రూ.8 లక్షలు వరకూ ఉన్నవారు అర్హులని తెలిపారు. ఏదైనా గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు పొంది ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తించిన 21 సబ్జెక్టుల్లో ప్రపంచంలోని టాప్ 200 విదేశీ విశ్వవిద్యాలయాలు, విద్య సంస్థల్లో పీజీ, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ సీటు పొందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కాపు, ఇబిసి, మైనార్టీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు.

బాధితులకు వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ఇలపర్రు గ్రామ సచివాలయ పరిధిలో ఆబోతులదిబ్బ నివాసి మాదే శ్రీనివాసరావు గుండెపోటుతో మరణించగా అతని కుటుంబానికి రూ.పది వేల వైఎస్ఆర్ బీమా చెక్కు ఇలపర్రు సర్పంచి దండు పద్మావతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పులిదిండి వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్ కటితల మోహన్, గృహసారథి గుణపాటి సంజీవరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - ఉండి

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రతి సచివాలయం భాగస్వామ్యం కావాలని ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో అడబాల వెంకట అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడబాల వెంకట అప్పారావు మాట్లాడుతూ తమ సచివాలయ పరిధిలో పారిశుధ్య నివారణ కోసం సచివాలయ సిబ్బంది కృషి చేయాన్నారు. మండలంలోని పాందువ్వ, చెరుకువాడ, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సచివాలయ సిబ్బంది ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి అందే కొండలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి గొల్లలకోడేరు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకోడేరు

టిడిపి బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని టిడిపి గొల్లలకోడేరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కమ్మిలి వెంకట శివరామకృష్ణంరాజు అన్నారు. గొల్లలకోడేరు టిడిపి గ్రామ కమిటీని బుధవారం నూతనంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా కమ్మిలి వెంకట శివరామకృష్ణంరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెన్మెత్స హర్షిత ఈశ్వరి, ఉపాధ్యక్షునిగా జుత్తిగ శ్రీనివాస్, కార్యదర్శిగా కొండపల్లి ఏసు రత్నం, ట్రెజరర్‌గా సాలా సుబ్బలక్ష్మి, మరో 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులుగా ఎంపికైన వారిని నాయకులు అభినందించారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE cum M.A.C.T. AT SRIKAKULAM.
I.A.115/2023 in M.V.O.P. 57/2022.

Between: S(Ch)iguruvalasa Dalamma & 4 others ...Petitioners.
And:Mamidi Dhanaraju & 2 others ...Respondents.

To:R-1 Mamidi Dhanaraju, S/o late Dalayya, 43 years, Kalinga by Caste, Driver of Car No.AP-37-BF-4033, Peravali Road, Indrayya Nagar, Tanuku Old Town, West Godavari District, Andhra Pradesh State.
R-2 Sri Nitai Karmokar, Son of N.Sukder Karmokar, aged 52 years, Owner of Car bearing No.AP-37-BF-4033, resident of Door No.27-11-12, Kameswarivari Street, Tanuku Town, Post & Mandal, West Godavari District.

NOTICE

That the above named Petitioners has filed the above O.P. for claiming compensation under M.V.Act, against you and another and the same is posted to **24-05- 2023** for your appearance before the Honourable Court. Therefore you are hereby directed to appear before the Honourable Court on **24-05-2023 at 10-30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided as per Law in your absence.

(By order of the Honourable Court)

KARRI.SESHAGIRI RAO,
Advocate,Srikakulam.
Mobile:9542637477.